# రాస్తా రోకో

మృగశిర కార్తె ప్రవేశించగానే ఒకటి రెండు వర్షాలు జోరుగా పడ్డాయి. పంచాంగం లో ఈ యేడు మస్తుగ వానలున్నాయని రాసి వుందని అన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కూడా ఈ విషయాన్ని ఉగాదినాడు సభలో ప్రకటించి అందర్నీ మురిపించాడు. రైతులు ఇంతకుముందే దుక్కులు దున్ని పెట్టుకున్నారు. వర్షాలు అదునుకు పడేసరికి రైతుల ఆనందానికి అవధుల్లేవు. వెంటనే విత్తనాలు వేసారు. తర్వాత పడిన జల్లులకు విత్తనాలు మొలిచాయి. మొక్కలు జానెడంత పెరిగాయి. పొలాలు నాట్లు పడ్డాయి. ఈ యేడు ఖరీఫుపంటకు ఏం ఢోకా లేదనుకున్నారు అందరూ. కాని ఆర్ద్రకార్తె పోయినంక ఆకాశంలో మబ్బులే కనపడలేదు. నీలాకాశం నుంచి సూర్యుడు నిరాటంకంగా తన ప్రతాపాన్ని కురిపించాడు. మొలిచి భూమ్మీద లేచి నిలబడ్డ మొక్కలు వాడి వంగిపోయాయి. అది చూసి రైతులకు దుఃఖమాగలేదు. ఇది ఈనాటి కథ కాదు. రైతుల రెక్కల కష్టానికి విలువ కట్టే షరాబు లేడు.

ఈ యేడు అంత కరువుకాలం రాలేదనే చెప్పాలి. ఎందుకంటె నిరుడు శాన వానలు కురిసాయి. వానలకు భూమి జాలువట్టి కొంత పంట నష్టం కూడ జరిగింది. నిరుటి వానలకు ఈయేడు భూమిలో నీళ్ళకేం కొదువ లేదు. బోరుల్లో నీళ్ళున్నాయి. పూటిక తీస్తె పాత బావుల్లో బాగానే నీళ్ళూరుతున్నాయి. కాని ఆ నీళ్ళను వాడబారిన చేలకు పొలాలకు తోలుదామంటె కరెంటు వుండడం లేదు. వున్నప్పుడు లోవోల్టేజి. ఆ లోవోల్టేజితో మోటార్లు కొన్ని కాలిపోయాయి. వేలకొద్ది ఖర్చులు రైతుల నెత్తి మీద పడ్డాయి. దాంతో రైతులు మోటర్లను ఆన్ చేయడానికే భయపడ్తున్నారు. పరిస్థితి ఘోరంగా వుంది.

ఈ పరిస్థితి అంతా చూసి రాజేశం రైతుల సభకు పిలుపు ఇచ్చాడు. ఆ పిలుపు అందుకొని జమ్మికుంటకు చుట్టున్న పది ఊర్ల రైతులు కదిలారు. కరెంటు లేక దిక్కుతోచని రైతులు రాజేశం పిల్వగానే సభకు వచ్చారు. ఇన్నాళ్ళు వాళ్ళు రాజకీయ నాయకుల సభలకు బండ్లు కట్టె లారీలు తోల్తె వెళ్ళారు. కాని ఇట్లా తమ బాధల కోసం తమ సమస్యలను తీర్చుకోవడం కోసం సభ ఎప్పుడూ పెట్టుకోలేదు. ఇట్లా ఎన్నడూ పోలేదు కూడా.

రాజేశం పిలుపునందుకొని వేల సంఖ్యలో రైతులు జమ్మికుంటలో పోగయ్యారు. ఓ రెండు రోజులు సభలు పెట్టి పోరాటం చేస్తే తమ వ్యవసాయానికి ఏం నష్టం లేదు. పనులెట్లయిన కరెంటు లేక సాగడం లేదు. అడుగంది అమ్మైనా అన్నం పెట్టదన్నది

నిజం చేస్తున్నారే పరిపాల కులు! అనుకున్నారు రైతులు. ఇన్నాళ్ళు రైతులు గానుగెద్దుల్లా తమ పనులు తాము చేసుకుంటు పోతున్నారు. తమ పనేందో చేసుకొని ఏమన్న అయితె కర్మకు ఒదిలిపెట్టారు. దేహి అని యాచించ లేదు. ఒకరి ముందు చేయి జాపిన జీవితాలు కాదు. వుంటె తిన్నారు. లేకుంటె పస్తులున్నారు. ఒక్క వానదేవరను తప్ప వాళ్ళు ఎవర్నీ వేడుకొని ఎరుగరు. ఒక్క వానదేవరే కాదు ఎంతోమంది దేవరలున్నారని ఇప్పుడు వాళ్ళకు తెలిసొచ్చింది. ఆ దేవరలు ప్రార్థనలతో అర్జీలతో వినేవాళ్ళు కాదు. తాము ఉద్యమించ వలిసిందే. లేకపోతె పని నడువదని ఆ అమాయకు లైన రైతులకు అర్థమైంది. అందుకే ఈ సభ!

మార్కెటుయార్డులో రైతులందరు పోగయ్యారు. కొందరు బండ్లు కట్టుకొని వస్తే మరి కొందరు కాలి నడకనే అక్కడికి చేరారు. ఎర్రటి ఎండలో రైతులు గుంపులు గుంపులుగా కూర్చున్నారు. రాజేశం రాకకోసం చూస్తున్నారు.

పొత్కపల్లి నుంచి వచ్చిన కొమిరెల్లి నిరుటి వానలను చూసుకొని చెల్కలో బోరు వేయించాడు. ఆ బోరుతో రబీ పంట బాగానే చేతికి వచ్చింది. ఇప్పుడేమొ మొక్కజొన్నలు వేసాడు. వాటికి తడి పెడ్దామంటె బోరులో నీళ్ళున్నాయి కాని కరెంటు వుంటలేదు. ఈ సభ వల్ల ఏమైన కరెంటు బాధ తప్పుతదేమొ అని కొమిరెల్లి వచ్చాడు. కొమిరెల్లి బండి కట్టుకొని వచ్చాడు. పొత్కపల్లి చుట్టుపక్కల ఊర్ల నుంచి వచ్చిన రైతులు అక్కడే కూర్చొని వున్నారు. రాజేశం ఇంకా రాలేదు. రైతులు ముచ్చట్లలో పడ్డారు. ఎవరి బాధలు, అనుభవాలు వాళ్ళు చెప్పుకుంటున్నారు.

"కరెంటు మా యాష్ట పెడ్తున్నదె! దేవుడు వరమిచ్చిన పూజారి వరమియ్యడన్నట్లయితుంది. ఏం జేస్తం!" అన్నాడు కొమిరెల్లి.

అతని పక్కన జానయ్య చుట్ట తాగుతూ కూర్చున్నాడు. కొమిరెల్లి మాటలు అతడు విని కాస్సేపు ఏం మాట్లాడలేదు. "భూమిని నమ్ముకుంటె గీ కాలంల ఏం లాభం లేదన్న!" అన్నాడు హఠాత్తుగా ఆలోచనల్లోంచి తేరుకొని. రాజమల్లు పక్కనే బండికాడి మీద కూర్చున్న మొగిలయ్య అతనితో సహమతించాడు.

"నిజంగనే అన్న! ఎవసాయంల ఏం ఫాయిద కన్పిస్తలేదు. కరెంటుబాదలు. ఇత్తనాలు, మందుల పెట్టుబడులు పోంగ ఏం గిట్టుబాటయితున్నది చెప్పు!" అన్నాడు మొగిలయ్య. ఎండలో పని చేసి పనిచేసి అతని కండ్లు చికిలించుకొని పోయి కండ్లకొసల దగ్గర గీతలు ఏర్పడ్డాయి. కాలం కంటె ముందే తెల్లబడిన అతని బుర్రమీసాలు అతని నల్లని ముఖం మీద వెండి కుచ్చుల్లా మెరుస్తున్నాయి.

"గంతేగద! పోరగాళ్ళు సదువులకని పట్నంల పడ్తున్నరు. గటు పోయినోల్లు గటే పోతుండ్రు. ఎవసాయం మొకం చూస్తలేరు. మన తరంపోతె గీ ఎవసాయం చేసెటోల్లే వుండరు సూడు!" అన్నాడు రాజమల్లు. అతని చేతిలోని ముల్లుకర్రతో మాటిమాటికి నేలమీద ఏవో గీతుల గీస్తున్నాడు.

"పట్నంల పడ్డంక గీ మోటు పనులకేం ఒంగుతరు పోరగాళ్ళు" అన్నాడు కొమిరెల్లి. అతనికి తన ఒక్క కొడుకు ఇంటరు చదువుతనని కరీంనగరం పోయింది గుర్తుకు వచ్చింది. "వాడు వచ్చినా ఎవసం పని చెప్పేటందుకు నాకే మనుసొప్పదు! ఏం జేస్తం!" అని మనస్సులోనే అనుకున్నాడు కొమిరెల్లి. "అయిన కరెంటు వుంటె ఎవసం నేనొక్కన్నే చేసుకుంట. పోరగాడు లేకున్న ఏం కాదు! గీ కరెంటు తోటి మా తిప్పలైతుందనుకో!" మళ్ళా కరెంటుమీదికి వచ్చాడు కొమిరెల్లి. పక్కనే కూర్చున్న బాలయ్య కొమిరెల్లిలాగా మాసిన బట్టల్లోలేడు. తెల్ల బట్ట లేసుకొని దుమ్మెక్కడ అంటుతదో అని బండి నొగలు ఎక్కి కూర్చున్నాడు.

"కొమిరన్న ! పట్నంల కరెంటే కరెంటు..." అని మొదలుపెట్టాడు బాలయ్య. అతడు కొన్ని రోజులు హైద్రాబాదులో చిన్న కంపెనీలో టెంపరువరి ఉద్యోగం చేసి వచ్చాడు.

"పట్నంల పట్టపగలు సుత ఆఫీసుల్ల ఇండ్లల్ల లైట్లు ఏసుకుంటరన్న! లేకపోతే అంత శీకటి! ఏం కనపడదు. ఎప్పటికి గిర్రగిర్ర ఫ్యానులు తిర్గుతనే వుంటయి. శెమటన్నది వుండదనుకో! ఇగ గదంతపొంగ సల్లగుండే అల్మారీలు నడుస్తుంటయి. మల్ల అర్రలు సల్లగుంచే మెషీన్లు వుంటయి. గా వాటికంత కరెంటు కర్సు అయిపోతుంటది. కరెంటు లేకపోతె పట్నంల ఏ పనీ జర్గ దనుకో!" బాలయ్య చెప్తూ వుంటే కొమిరెల్లికి అనుమానం వచ్చింది.

"బాలన్న! పంటల్లేకపోతె మందికి తిండి వుండదు. తిండి లేకపోతె మనుషులు బతుకరు. గాని గవన్ని లేకపోతె మనుషులు బతకరంటవ! వున్న కరెంటంత పట్నమె మింగబట్టె గట్ల. ఇగ మనకేం మిగులుతది. రైతులకు కరెంటు ఒదలకుంట గా కరెంటును గట్టెట్ల దండుగ చేస్తున్నరంటవ్!" అన్నాడు కొమిరెల్లి.

"అది దండుగని నీకనిపిస్తుంది బాయ్! ఆళ్ళకవన్ని ఆరామ్ కోసం కావాలె గద! మనం ఎండల బుగ్గిల పని జేస్తం. గాని గా వాళ్ళెందుకు జేస్తరు. ఎప్పుడు సల్లంగ వుండె అర్రల కూసొని పన్జేస్తరు ! గంతెందుకు అన్న! గిప్పుడుకొన్ని మెషీన్లు ఒచ్చినయంట. వాటిని కంప్యూటర్లు అంటరు. గా వాటికి సుత సల్లగుంచె మెషీన్లు కావాలంట ! అవి నడిసెటందుకు మస్తు కరెంటు గుంజుతదంట! ఆ మెషీన్లు దునియల వున్న పన్లన్ని జేస్తవంట!"

"అంటె! పంటలు కూడ పండిస్తయ!" నోర్లు వెళ్ళబెట్టాడు కొమిరెల్లి.

"అగో రాజేసం ఒచ్చిండే అన్న!" అన్నాడు రాజమల్లు వస్తున్న వ్యక్తిని చూసి.

రాజేశం ఖాదీ పైజామా లాల్చీలో వున్నాడు. అతని వెంట ఆ వేషంలోనే ఇంకో నలుగురున్నారు. రాజేశం అందరికీ కనపడాలని ఓ బండి మీదికెక్కి నిలబడ్డాడు. మార్కెటు యార్డులో తమ బండ్లు ఎడ్లతో పాటు గుంపులుగా కూర్చొని వున్న రైతులందరి వైపు చూసాడు. ఒక్కసారి తన చుట్టూ ప్రదరక్షిణంగా తిరిగి చేతులెత్తి ఊపాడు రాజేశం. రైతులను

చూస్తూ 'రైతు సోదరులారా! రైతన్నలారా!'' అని పెద్దగా సంబోధించాడు. అతని గొంతు గంభీరంగా స్పష్టంగా వుంది. అతని గొంతు వినగానే రైతులందరూ తమ మాటలాపి నిశ్శబ్దంగా వుండిపోయారు. రాజేశం గొంతెత్తి మాట్లాడసాగాడు.

'రైతన్నలారా! రైతులకు కావల్సినంత కరెంటు ఇవ్వాలి! దాన్ని ప్రభుత్వం దృష్టికి తేవడానికే మనమిక్కడ చేరాం. రైతులకు కరెంటు లేకపోతే పంటలుండవు ! పంటల్లేకపోతె ప్రజలకు తిండి వుండదు. ఇది ప్రభుత్వానికి ఎరుకలేదా? ఎరుకే. రైతుల బాధలను ప్రభుత్వం గాని పాలకులు గాని పట్టించుకుంటలేరు. రైతుల అవసరాలను రైతుల పాట్లను చూడని ప్రభుత్వం అభివృద్ధి వ్యతిరేకమైంది. సోదరులారా! ప్రజలకు కూడు పెట్టలేక పెద్దపెద్ద రాజ్యాలు కూలిపోయాయి. ఇది మన పాలకులకు ఎరుకలేదా? అంటున్నా! పట్నాలల్లో కరెంటు వుంటున్నప్పుడు రైతులకు ఎందుకుండదు కరెంటు అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను! రైతన్నలారా! పట్నంల కరెంటు లేకపోతె పరిశ్రమలు దెబ్బతింటయంటారు. మరి పల్లెలూర్లల్ల కరెంటు లేకపోతె రైతులు పంటలెట్ల పండిస్తరు. దేశానికి రైతు అయువుపట్టు అని నాయకులు ఉపన్యాసాలిస్తరు. కాని నిజానికి వాళ్ళు రైతులకు చేస్తున్నదేంది? అని అడుగుతున్నా! సోదరులారా! రైతులకు రోజుకు ఎనిమిది గంటలైనా కరెంటు ఇయ్యాలి! దానికోసం మనం పోరాటం చేద్దాం. కావలిస్తే ''చలో అసెంబ్లీ'' అని హైద్రాబాదును ముట్టడిద్దాం. అసెంబ్లీ ముందు ధర్నా చేద్దాం! పోరాటానికి మీరు సిద్ధం కావాలి! ఈరోజు నుంచే మన పోరాటాన్ని ఆరంభిద్దాం! ఎన్ని రోజులైనా సాగిద్దాం! మీరు సిద్ధమేనా చెప్పండి! రైతు సోదరులారా!'' పెద్ద గొంతుతో అడిగాడు రాజేశం.

''మేమంతా పోరాటానికి సిద్ధమే!'' అని అరిచారు రైతులు గొంతులెత్తి. బిగించిన పిడికిళ్ళతో వాళ్ళ చేతులు పైకి లేచాయి.

రాజేశం గొంతెత్తి బిగ్గరగా ఉత్సాహంగా అరిచాడు – 'రైతు సోదరులారా! మన పోరాటం ఈరోజు నుంచే కొనసాగిద్దాం. ఈ రోజు మన బండ్లను ఎడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేద్దాం. కావలిస్తే మనందరం రోడ్డుకడ్డంగా పండుకుందాం ! రైతన్నలారా! ఈరోజే రాస్తారోకో మొదలు!'' పిడికిలి పైకి లేపి పిలుపునిచ్చాడు రాజేశం.

''రాస్తా రోకో చేద్దాం'' అరిచారు రైతులు.

రైతులు రాస్తారోకో కార్యక్రమాన్ని ఆరంభించారు. దాంతో రహదారిలో నడిచే పెద్దపెద్ద లారీలు, బస్సులు, కార్లు ఇంకా ఎన్నో వాహనాలు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

ఈ సంగతి తెలిసి జిల్లా కలెక్టరు వినోద్ వచ్చాడు. కలెక్టరు ముప్ఫై ఏండ్లు పైబడని యువకుడు.

''గీ పొట్టెగాడు కలక్టరేందే! మునుపు అనుభవమున్నోల్లు కలెక్టర్లుగ ఉండెటోల్లు. గిప్పుడేమొ పరీక్ష రాసి పాసై పొట్టెగాల్లు ఒస్తున్నరు. గావాల్లకేం అనుబవం! రైతుల బాదలు వాల్లకేం తెలుస్తయి చెప్పు బాలన్న!'' అన్నాడు మొగిలయ్య.

"మోటలు కొట్టుకున్నప్పుడే నయముండె. ఒకల్లను దేహి అనకుండ పంటలు పండిచ్చినం. గిప్పుడో ! ఇత్తనాలని, ఎరువులని ఇంకపోతె పురుగు మందులని - అన్నిటికి దుకాణాల పొంటి ఉరుకాలె! అన్నటికీ పైసలు కావాలె ! గింజలకేమొ దర వుండదు. అన్నిటికి దరలు మండిపోతుంటం! ఇగ ఎవసం ఎట్ల జేస్తం చెప్పు! బాలన్న!" అన్నాడు కొమిరెల్లి పక్కన కూర్చున్న లింగన్న.

లింగన్న నైజాం కాలంలో యవ్వనంలో అప్పుడే అడుగుపెట్టిన యువకుడు. రజాకార్లతో, దొరలతో, దేశముఖులతో ఉడుకురక్తంతో పోరాడిన వీరుడు. డెబ్భై ఏళ్ళుం టాయి అతనికిప్పుడు. కొడుకులు మనుమలతో పాటు ఇంకా వ్యవసాయం పనులు చేస్తున్నాడు.

ఇంతలో రాజేశం ముందుకు వచ్చాడు. కలెక్టరు అతన్ని సమీపించాడు. రాజేశంతో ఏదో మాట్లాడి రైతులను సంబోధించాడు.

"రైతులారా ! మీ సమస్య లేమిటో మాతో చర్చించండి. సామరస్య మార్గంలో తీర్చుకోండి. ఇట్లా రాస్తారోకో చేస్తే మీ సమస్యలు తీరుతాయా? చెప్పండి!" అని అడిగాడు.

"మా సమస్య కరెంటు! మాకు కరెంటు కావాలె! రోజుకు ఎనిమిది గంటలైనా మాకు కరెంటు వుండాలె!" అని కొందరు రైతులు ముందుకు వచ్చి అరిచారు.

కలెక్టరు రెండు చేతులెత్తి మీరు శాంతంగా వుండండి అన్నట్లుగా ఊపాడు.

"రైతులారా ! మీ సమస్య ఏమిటో మాకు తెలిసింది. నేను వెంటనే ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వాళ్ళను కలుసుకుంటాను. మీ సమస్య గురించి మాట్లాడ్తాను. మీ పోరా టాన్ని విరమించండి!" అన్నాడు కలెక్టరు.

"గిన్నాల్లు పట్టించుకోలేదు. గిప్పుడేం చేస్తరో మాకు నమ్మకంలేదు" అరిచాడు ఓ రైతు.

"అవును ! మాకు నమ్మకం లేదు. మా పోరాటం ఆపం!" అరిచారు రైతులందరూ ఏక కంఠంతో.

రాస్తారోకోలో రైతులకు మద్దతుగా రైతుకూలీలు కూడా వచ్చి చేరారు. వ్యవసాయం లేకపోతె వాళ్ళకూ పనులుండవు. వాళ్ళ కడుపులూ ఎండుతాయి.

కలెక్టరు మళ్ళా రెండు చేతులు పైకెత్తి అటూ యిటూ ఊపాడు.

"నేను చెప్తున్నాను గదా! నేనే స్వయంగా మీ సమస్య గురించి చూస్తాను. వెంటనే కావల్సిన చర్యలు తీసుకుంటాను. మీరిక మీ పోరాటాన్ని విరమించండి!" అన్నాడుకలెక్టరు.

"మేము ఇంతకుముందు కరెంటుకోత గురించి మీ దృష్టికి తెస్తూ ఉత్తరాలు ఇచ్చిన మీరు ఎన్నోసార్లు ఈ సమస్యను పరిష్కరిస్తమని వాగ్దానాలు చేసిండ్రు. కాని సమస్య పరిష్కారం కాలేదు. ఈసారి కరెంటు కోత పొయ్యేదాకా మేం పోరాటం ఆపదలుచు కోలేదు!" అన్నాడు రాజేశం కలెక్టరుతో. అతని గొంతు దృఢంగా వుంది.

"నేను మీకు హామీ ఇస్తున్నాను గదా ! నేనే స్వయంగా మీ సమస్యను చూస్తాను!" అన్నాడు కలెక్టరు మళ్ళా.

"గదంతా మాకు తెల్వదు. గిప్పుడే కరెంటోల్లను పిల్చి మాకు కరెంటుకోత వుండదని చెప్పిచ్చుండ్రి!గప్పుడే మేం నమ్ముతం! మా పోరాటం ఆపుతం!" అన్నాడు బాలయ్య గుంపు లోంచి ముందుకు వచ్చి.

కలెక్టరు పక్కనున్న రాజేశంతో ఏదో మాట్లాడాడు. వెళ్ళిపోయాడు. మళ్ళా ఆరోజు అతడు రాలేదు. కాని మధ్యాహ్నంలోకల్లా లారీల్లో పోలీసులు దిగారు. తలల మీద ఇనుపటోపీలతో చేతుల్లో తుపాకులతో, లాఠీలతో బూట్లు టకటకలాడిస్తూ దిగిన పోలీసు లను చూసేసరికి రైతుల ధైర్యం సడలింది. రైతులు భయపడిపోవడం చూసిన రాజేశం ఓ బండి మీదికెక్కి రైతులను సంబోధించాడు.

"రైతు సోదరులారా! మీరు భయపడొద్దు. మీ పట్టు విడువొద్దు. ఇప్పుడు మీరు వెనుకకు తగ్గారంటె మన పోరాటముండదు. మన సమస్య మళ్ళా మొదటికి వస్తుంది. కాబట్టి రైతన్నలారా! మీరీ పోరాటాన్ని ఆపవద్దని మీకు మనవి చేసుకుంటున్నాను!" అని గొంతెత్తి అరిచాడు.

పోలీసు యస్.పి. వచ్చి దారికడ్డంగా వున్న బండ్లను ఎడ్లను తొలగించమని చెప్పాడు రైతులకు. "మాకు కరెంటుకోత వుండదని కలెక్టరు హామీ ఇచ్చేదనుక మేం కదలం!" అన్నారు రైతులు.

"అయితే మిమ్మల్ని బలవంతంగా ఇక్కడ్నుంచి కదిలించవలసి వస్తుంది! అవసరమైతే కాల్పులు జరుపుతాం!" కర్కశంగా మాట్లాడాడు యస్.పి.

"మేం తుపాకి గుండ్లను ఎదుర్కునేటందుకు తయారుగ వున్నం!" అని ముందుకు తోసుకొని వచ్చారు రైతులు.

రైతులను భయపెట్టేందుకు గాలిలో కాల్పులు చేయించాడు యస్.పి. ఆ తుపాకుల ధ్వనులు రైతుల గుండెల్లో గుబులును లేపాయి. అయినా వాళ్ళు రహదారి మీది నుంచి కదల్లేదు. ఇంతలో ఎవరో పోలీసుల మీదికి రాయి రువ్వారు. అంతే యస్.పి. ఉగ్రుడై 'ఫైర్' అని అరిచాడు. పోలీసులు రైతుల మీద తుపాకి గుండ్లను కురిపించారు. తుపాకి గుండ్లు రైతుల గుంపులో వున్న లింగన్న గుండెలో దిగింది. దొరల దౌర్జన్యాలను ఎదుర్కున్న లింగన్న ఈరోజు పోలీసుల తుపాకులకు బలి అయ్యాడు. ఇంకా కొందరు రైతులు గాయపడి నేలకొరిగారు. దాంతో రైతులందరు దిక్కుతోచక అటుయిటు పరిగెత్తారు.

వెంటనే విజిల్స్ ఊదిన శబ్దాలు బర్రుబర్రుమని కార్లు, జీపులు వచ్చి ఆగిన ధ్వనులు 'పీప్‌పీప్' అని వాటి మీదున్న లైట్ల చప్పుడులు! వెలుగు!- కార్లలోంచి కలెక్టరు అతనితో మంత్రి దిగారు. యస్.పి. వాళ్ళ కెదురుగా పోయి సెల్యూటు చేసాడు. యస్.పి. ముందు నడుస్తుంటె కలెక్టరు మంత్రి వెనుక నడిచారు. వాళ్ళు సరాసరి లింగన్న శవమున్నచోటికి చేరుకున్నారు.

"జరిగిందానికి నేను చాలా విచారిస్తున్నాను. చనిపోయిన లింగన్న కుటుంబానికి ఐదు వేలు గాయపడినవారికి రెండువేల రూపాయలు ఇస్తామని ప్రకటిస్తున్నాను" అన్నాడు మంత్రి.

మంత్రి రాజేశాన్ని, కొందరు రైతులను కలిసి మాట్లాడాడు.

"మాకు కరెంటు రోజుకు ఎనిమిది గంటలైనా కావాలె" అని మంత్రిని అడిగారు రైతులు.

"దానికేం! వెంటనే నేను మీకు ఎనిమిది గంటలు కరెంటు వుంటుందని హామీ ఇస్తున్నాను" అన్నాడు మంత్రి. సమస్య మంత్రి రాకతో వెంటనే పరిష్కరింపబడటం అందర్నీ సంతోషంలో ముంచేసింది. రైతులు జరిగింది మరచిపోయి హర్షంతో చప్పట్లు చరిచారు. వెంటనే మంత్రి రైతులను సంబోధిస్తు మాట్లాడాడు.

"రైతు సోదరులారా! ఈ దేశానికి వెన్నెముక మీరు. మీరు ఇటువంటి హింసకు, పోరాటానికి పూనుకోవడం శోచనీయం. కాని మాకు తెలుసు. మిమ్మల్ని ఎవరో రెచ్చగొట్టారు. మీరు రైతులు. మీకు రాజకీయాలు తెలియదు. రాష్ట్రంలో అస్థిరత, అరాచకం సృష్టించాలని ప్రతిపక్షపార్టీలు చేసిన వ్యూహం ఇది! ఆ వ్యూహంలో మీరు చిక్కుకోకండి! సోదరులారా! మాకు తెలుసు. పోయిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం వర్షాలు తక్కువ కురిసాయి. అందుకే పోయినఏడాది కన్నా ఈయేడు మీకు ఇరవైఐదు శాతం ఎక్కువ కరెంటు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మీకు తెలుసు! – మా ప్రభుత్వం పేదలకు, రైతులకు అన్నివిధాల తోడ్పడు తుంది. వాళ్ళ అభవృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడ్తున్నది..." మంత్రి ఉపన్యాసం సాగుతున్నది.

రైతులు చాలా శ్రద్ధగా మంత్రి మాటలు వింటున్నారు.

"రైతు సోదరులారా ! మీకు రేపటి నుంచే ఎనిమిది గంటలు కరెంటు వుంటుంది. ఆ బాధ్యత మాది! ఇక మీరు నిశ్చింతగా వుండండి. మీరంతా మీ ఊళ్ళకు పోయి వ్యవసాయం పనులు చేసుకోండి!" మంత్రి మాటలు విని రైతులు హర్షోల్లాసంలో మునిగిపోయారు. నిశ్చింతగా తమ ఇండ్లకు వెళ్ళిపోయారు. తెల్లారితే ఇక కరెంటు కోత వుండదని హాయిగా నిద్రపోయారు.

తెల్లవారి చూస్తే కరెంటు రాలేదు. ఆ రోజంతా రాలేదు. ఆ రోజే కాదు మర్నాడు - ఆ మర్నాడు కూడ కరెంటు రాలేదు. మొత్తమే బందయింది! ఎందుకట్లా అయిందో రైతులకు అంతుపట్టలేదు. తరతరాల నుంచి వస్తున్న వేదాంత ధోరణిలో తమ కర్మను నిందించుకున్నారు. తమ అదృష్టం అంతేనని ఊరుకున్నారు.

కరెంటయితే రాలేదు కాని రాజేశం మాత్రం జిల్లా మార్కెటు కమిటీ ఛైర్మన్ అయ్యాడని పత్రికల్లో వార్త మాత్రం వచ్చింది.

– మార్చి, 2001